# ప్రజ్ఞానం


మలపాక
వెంకటలక్ష్మి



అలవాటు ప్రకారం పోష్టుకోసం ఎదురు చూస్తున్న మాధవికి ఎదురుగా తండ్రి మెట్లెక్కుతూ కనిపించేటప్పటికి తన పరధ్యానానికి సిగ్గుపడి వెనుదిరిగింది. ఆమె అంతర్యం గ్రహించినట్టుగా చలపతిగారు జేబులోంచి ఒక కవరును తీసి ఇదిగో నమ్మా! నేను రాఘవయ్యగారి యింటి దగ్గర ఉంటే ఇచ్చిపోయాడు అంటూ కూతురికి అందించారు. ఆ మాటలువిన్న మాధవి మదిలో ఏదో అవ్యక్తమైన ఆశ ఒక్కక్షణం మెదిలి అది కాస్తా ఉత్తరం మీద అడ్రసు రాసిన వైఖరి గమనించి మాయమయ్యింది. అది అక్కగారి రైటింగని గ్రహించిన ఆమె ఉత్తరం చదవటంలో నిమగ్నమైపోయింది.

ఏనాడయినా అత్తవారి దగ్గరనుంచి చల్లని కబురుతో తనకు ఆహ్వానం రాకపోతుందా అన్న ఆశతో మాధవి రోజూ

పోస్టుకోసం ఎదురుచూస్తుందని చలపతికి తెలుసు. పోస్టుమేన్ వెళ్ళిపోగానే నిరాశతో నిండిన ఆమె ముఖం చూస్తే ఆయన గుండెమీద వెయ్యి సమ్మెట దెబ్బలు తగిలినంత బాధగా ఉంటుంది. ఒక్కొక్కప్పుడు తన అసమర్థతే ఆమె బాధకు కారణమేమో అని ఆయన కనిపిస్తుంది మరోమారు. అత్తింటివారు మూర్ఖులైతే ఆడపిల్ల బ్రతుకి తేకరా అనిపిస్తుంది. ఆయన భార్య మాత్రం "అందని పండ్లకు అర్రులు చాచారు" అంటుంది. తను మాత్రం ఏం చేస్తాడు! ప్రతి ఆడపిల్ల తండ్రికి వల్లనే తాహతుకు మించినా కొంచెం కట్నం ఎక్కువ ఇస్తే పిల్ల సుఖపడుతుందనే ఆశతో మూడువేల రూపాయల కట్నంతో మాధవి పెళ్ళి స్థిర పరిచాడు. తనకున్న ఇద్దరాడపిల్లలలోనూ మాధవి చిన్నది. పెద్దమ్మాయి రాధ పెళ్ళయి సలక్షణంగా కాపరం చేసుకుంటోంది. ఉన్న ఒక్కగానొక్క మొగపిల్లాడూ ప్రాజ్ఞుడై ప్రక్కనున్న పల్లెలో బడి పంతులుగా బాగానే జీవిస్తున్నాడు. యిక యీ ఒక్క శుభం అయిందనిపించి తనూ, భార్యా ఉంటే తిని లేకపోతే పస్తుండ వచ్చునన్న తలంపుతో అన్నీ ఆలోచించే కనీ నిర్ణయానికి వచ్చాడు. కాని వాస్తవంలో జరిగిందేమిటి? అంతా తారుమారై మొదటికి వచ్చింది. కాబోయే వియ్యాలవారు మంచి వారుగా కనిపించినా డబ్బు దగ్గర ఆలస్యం చెయ్యటం ఎందుకన్నట్లు తనదగ్గరున్న మొత్తానికి సాయం వెయ్యిరూపాయిలు అప్పుతెచ్చి నిశ్చింతగా పెళ్ళిపనులలో తను నిమగ్నమై ఉన్న తరుణంలో అకస్మాత్తుగా కొడుకు వచ్చి తనతోటి ఉపాధ్యాయులకు తన లాగ గవర్నమెంటు వారిచ్చిన జీతాన్ని తను పట్నంనుంచి తెస్తూండగా దొంగలు తనను దగ్గిరించి మొత్తం సొమ్ముతోబాటు చేతినున్న వాచీ, ఉంగరం కూడా దోచుకున్నారని చెప్పి, తనపరువు నిలబెట్టటం కోసం చెల్లెలిపెళ్ళికని ఉంచిన సొమ్ములోంచి కొంత ఇమ్మని ప్రాధేయపడుతూ అడిగినా తాను కాదనలేక పోయాడు. డబ్బుకంటే పరువే ప్రధానమని భావించే తను కొడుక్కి కావలసిన డబ్బిచ్చి పంపాడు. పెళ్ళికి ముందుగానే వియ్యంకుడి పేర తను ఇవ్వవలసిన డబ్బుకు సాధారణ వడ్డీకంటే అదనంగా నేవేసి నోటువ్రాసి ఇంచాడు. మేళతాళాలమధ్య బెదురుతున్న గుండెను చిక్కబట్టుకుని నోటును వియ్యంకుని చేతిలో ఉంచి ఆందోళనతో ఆయన ముఖంలోకి చూచాడు. మౌనం వహించిన ఆయన గాంభీర్యాన్నిచూపి తను కొంచెం స్థిమితపడబోతున్న సమయాన పట్టుచీరను వినవినలాడించుకుంటూ వచ్చిన వియ్యపురాలు విషయం తెలుసుకుని తనను అనరాని మాటలంది. మూడుముళ్ళూ ఎల్లాగా పడనే పడ్డాయి కనుక ఇక మిగిలినడబ్బు తీసుకుని మరీ పిల్లను కాపరానికి తీసుకు




రమ్మని పెళ్ళికొడుకును పీటలమీదనుంచి తీసుకుపోయింది. అప్పటికి విస్తుపోయిన తను స్థాణువే అయిపోయాడు. ఆక్షణం నుంచీ తాను పడరానిపాట్లు పడుతూనే ఉన్నాడు ఆ డబ్బుకోసం. ఇలా గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూన్న చలపతిగారు భార్య సుభద్రమ్మ పిలుపుతో ఏమిటన్నట్లు చూచారు.

"కాఫీ ఇక్కడ ఉంచి పావుగంటైంది చల్లారిపోతుంది త్రాగండి" అంది. తన తప్పు ఒప్పులను సమర్థించుకోవడానికి పట్టినకాలం కేవలం పదిహేనునిమిషాలు మాత్రమేనా అని ఆశ్చర్యపోతూ గబగబా కాఫీని పూర్తిచేసి మళ్ళీ భార్యకేసి సాలోచనగా చూస్తూ ఉండిపోయారు. అందుకు సమాధానంగా ఆమె "ఇంతసేపు మీ ఆలోచనలను ఆకట్టుకున్న ఆ ఉత్తరం ఎక్కడినుంచి వచ్చిందని" అడిగింది. పెద్దమ్మాయి రాధ తనకు ఒంట్లో బాగుండలేదనీ, డాక్టరు రెస్టు తీసుకోమన్నాడనీ. అందుకు వారంరోజులలో ఇక్కడకు వస్తున్నాననీ వ్రాసింది. అని ఉత్తరంలోని సారాంశాన్ని చెప్పి చలపతిగారు పైమీద ఖండువా దులుపుకొని వీధిలోకి వెళ్ళిపోయారు

సంచిలోంచి కూరలన్నీ ఒక్కొక్కటే తీస్తూ చలపతిగారు భార్యనుద్దేశించి "నీకొక శుభవార్త చెప్పనా అన్నారు. ఏమీ ఉత్సాహం చూపకుండానే ఆమె చెప్పండి అంది.

మన యింటిని సుబ్బారాయుడుగారు కొంటానన్నారు. అప్పుతీరిపోగా మిగిలిన డబ్బుతో మాధవుని అత్తవారింటికి పంపవచ్చునని స్పష్టంగా చెప్పారు. ఆ సంగతి విన్న సుభద్రమ్మగారు గుడ్లనీరు కుక్కుకొని ఆ యిల్లు మాత్రం అమ్మడానికి వీల్లేదంది. అది వాళ్ళతాతగారు కట్టించి వాళ్ళ

నాన్నకిస్తే, వాళ్ళనాన్న తనకిచ్చాడని, తను ఆ ఇంట్లోనే పుట్టాననీ, ఆ గుక్కెడు ప్రాణం అక్కడే పోవాలనీ ఖచ్చితంగా చెప్పింది. ఆ మాటలు విన్న చలపతిగారు కోపంగా "నీ గుక్కెడు ప్రాణంకంటే మాధవి కాపరం ముఖ్యం అని మరిచి పోకు" అన్నారు. అందుకామె "ఈ బాధ లన్నీ చూడలేక నా ప్రాణం తొందరలోనే పోతుంది లెండి" అంది రోషంగా.

తల్లినింత ఏడ్పించి తను అత్తారింటికెళ్ళి ఏం బావుకోవాలి అనుకుంది మాధవి. అసలు ఈ అనర్థానికి మూలం తనుకదా! కన్నవాళ్ళ నింతబాధ పెట్టిన తను ఏ అర్ధరాత్రివేళో వెనక దొడ్లో ఉన్న పాతబావిలో పడటం మేలనుకొంది. ఆ మాటలనే అనాలోచితంగా పైకి అనేసి ఏడుస్తూ తల్లి ఒళ్ళో తల దాచు కుంది. తన ప్రాణమైన కూతురు విన్నం దుకు నిర్ఘాంతపోయిన సుభద్రమ్మగారు కూతు రును ఓదార్చలేక ఆలోచనలో పడ్డ చలపతి గారు మెల్లగా వీధిలోకి వెళ్ళిపోయారు.

యాంత్రికంగా గుమ్మంలో నిలబడిన మాధవికి పోస్టుమేన్ ఒక కవరును అందించాడు తనకు ప్రత్యేకంగా ఉత్త రం ఎవరు వ్రాసారా అని ఆశ్చర్య పోతూ కవరు చింపి చదవటం ప్రారంభించ గానే ఆమె ముఖం సిగ్గుతోనూ, ఆనందం తోనూ రంగులు మారింది. అది గమ నించిన తల్లి పూర్తిగా చదివేవరకూ ఆగి "ఎక్కడినుంచి" అని కూతురినడిగింది.

అందుకు మాధవి సిగ్గుతో వారిదగ్గరనుంచి వచ్చిందమ్మా అంది. మీఆయనదగ్గరనుంచా పట్టిపట్టి అడిగింది. అవునమ్మా! అంటూ మాధవి ఆ సంతోషంలో కవరును తల్లికి అందించబోగా నువ్వే చదివి చెప్పు అంది

సగం సిగ్గుతోనూ, మిగిలిన సగం ఆనందంతోనూ ఉక్కిరి బిక్కిరి అయి పోతున్న మాధవి ఉత్తరంలోకి చూస్తూ "ఆయన బి. ఏ. పరీక్షలు బాగా వ్రాశా రుటమ్మా—తన స్నేహితుడి తండ్రిగారి ఆఫీసులో ఆ ఊరిలోనే నెలకు నూట యాభై రూపాయల ఉద్యోగం కుదిరిందిట. ఇంక తన కాళ్ళమీద తను నిలబడగలరు కనుక త్వరలో వచ్చి నన్ను తీసుకు వెడతా ననీ—ఇప్పుడు తన తల్లి దండ్రులకు తను భయపడవలసిన అవసరంలేదనీ— ఎన్ని ఆటంకాలు వచ్చినా తను వచ్చి నన్ను తప్పక తీసుకు వెడతానని వ్రాస్తూ అసలు ఈ ఉపాయాన్ని చెప్పి వాళ్ళనాన్న దగ్గర ఉద్యోగం వేయించింది మా పెళ్ళికి వచ్చిన తన స్నేహితుడేననీ వ్రాశారు. ఈ విషయం నాన్నకి నీకు చెప్పి ప్రయా ణానికి సిద్ధంగా ఉండమని వ్రాశారు అని ముగించింది.

ఇదంతా గుమ్మంలోనే నిలబడి వింటున్న చలపతి కూతురు దగ్గరకొచ్చి "నువ్వు అదృష్టవంతురాలవమ్మా! నీ భర్తలాంటి ప్రాజ్ఞులు, విజ్ఞులు నూటికి ఒక్కరున్నా చాలునన్నారు."